క్లుప్తంగా

మైనార్టీలకు ప్రాధాన్యం ఇస్తున్న సీఎం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్ అన్నారు. కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన మొహమ్మద్ జాకీర్ హుస్సేన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని ఇందాద్ ఘర్‌లోని తన కార్యాలయంలో గౌస్‌మొహిద్దీన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసి ఏ రకమైనా సంక్షేమ పథకాలు అందకుండా మోసం చేశారన్నారు. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మైనారిటీలకు కేవలం సంక్షేమ పథకాల విషయంలోనే కాకుండా సామాజికంగా, రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మైనారిటీ పెద్దలు షేక్ నజీర్, ఎండీ కరిముల్లా పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



రిషిత సాగర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఏపీ ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ పోటీలకు అట్కిన్‌సన్ (గొల్లపూడి) పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కె.రిషిత సాగర్ ఎంపికైంది. ఈ నెల 16న నూజివీడులోని బేతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన బాలబాలికల ఎంపికలో అండర్–14 బాలికల విభాగంలో రిషిత సాగర్ కనబరిచిన ప్రతిభతో పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ ఎస్.సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట అజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించనున్న బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున పాల్గొనేందుకు ఈ ఎంపికలు జరిగాయిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అట్కిన్‌సన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమ పావని రిషిత సాగర్‌ను అభినందించారు.

మధురంగా సాగిన దాస పదామృతం



విజయవాడ కల్చరల్: స్వరఝురి సంగీత సంస్థ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద మంగళవారం నిర్వహించిన దాస పదామృత కార్యక్రమం సంగీత వైభవాన్ని చాటింది. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ వాగ్గేయకారులు, భక్తి తత్వవేత్తలు త్యాగరాజ స్వామి కీర్తన గిరిరాజ సుత, తూము నరసింహ దాసు లేరానాసామి, పరాకుంశదాసు శ్రీరాముల, బొమ్మరాజు సీతారామదాసు భక్తి భిక్షాందేహి, మన్నెకొండ హనుమదాసు, పరమాత్మ, పురందరదాసు కలియుగదల్లి, రామదాసు తక్కువేమి మనకు తదితర కీర్తనలను మధురంగా గానం చేశారు. వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, వీణపై శశిధర్, మృదంగంపై సద్గురు చరణ్, ఘటంపై కేవీ కిషోర్ సహకరించారు. లంకతేజస్వి భక్త దాసుల కీర్తనల వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్, పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు జక్కంపూడి వైఎస్సార్ కాలనీ బ్లాక్ నంబరు 43లో సిందే దేవేందర్ మనోహర్ కుటుంబం నివాసం ఉంటోంది. మనోహర్ గ్యాస్ పొయ్యిలు తయారు చేస్తుంటాడు. మంగళవారం ఉదయం మనోహర్ అపార్టుమెంట్‌పైకి వెళ్లి నీళ్ల వాల్వ్ తిప్పి తిరిగి ఇంటికి వస్తుండగా, అదే బ్లాక్‌లో నివాసం ఉండే చోటు అనే వ్యక్తి వచ్చి దూషించడమే కాకుండా తన చేతిలో ఉన్న గాజు గ్లాస్‌తో మనోహర్ తలపై కొట్టాడు. దీంతో మనోహర్ కంటి మీద గాయం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మైలవరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి ఎం. శైలజ తెలిపారు. మైలవరం కోర్టు ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. జడ్జి శైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో మొక్కలు పెంచి పర్యావరణంలో ఆక్సిజన్ పెంపొందిందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి. పద్మశ్రీ, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన చవితి వేడుకలు

విఘ్నాధిపతికి ఘనంగా పూజలు



కందులవారివీధిలో కొలువుదీరిన గణపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తొలిపూజను అందుకుని విఘ్నాలను నివారించే గణనాథుని వేడుకలు సోమవారం వన్‌టౌన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పాతబస్తీలో వాడవాడలా వినాయకచవితి వేడుకలను వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి ఆ మూషికవాహనుడి ఆశీస్సులందుకున్నారు. అడుగు నుంచి 15 అడుగుల వరకూ వివిధ స్వరూపాల్లో విభిన్న ఆకృతుల్లో గణపయ్య విగ్రహాలు భక్తులను కనువిందు చేశాయి. వ్యాపార సంఘాలు, మిత్రబృందాలు, ఆలయాలు, కాలనీ కమిటీలు ఇలా వివిధ రూపాల్లో ఏర్పడ్డ బృందాలు వారివారి శక్తిమేర గణపతిని పూజించి స్వామి ఆశీస్సులందుకున్నారు. వన్‌టౌన్‌లోని పూలబావివీధి సుమారు 15 అడుగుల మేర భారీ గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అలాగే కందులవారివీధిలోని శ్రీ గణేష్ ఉత్సవ సమితి (మార్వాడీ సంఘం) ఆధ్వర్యంలో ఉత్తరభారతదేశంలో సంప్రదాయానుసారం ప్రత్యేకరూపంలో ఉన్న గణపతిని ఏర్పాటు చేశారు.

భారీ గణనాథులు

వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన భారీ గణనాథులు భక్తులను ముచ్చటగొలుపుతున్నాయి. సమ్మెటవారి వీధిలో రైతు గణపతిని ఏర్పాటు చేశారు. అలాగే వివిధ రూపాల్లో గణపతి, పరమశివుని స్వరూపాలను ఏర్పాటు చేసి అలరింపజేశారు. వీటిని చూసేందుకు భక్తులు బారులు తీరారు. వస్త్రలత ప్రాంగణంలో భారీ గణపతి విగ్రహాన్ని వస్త్ర వ్యాపారులు ఏర్పాటు చేశారు. కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ కాంప్లెక్స్‌లోనూ భారీ గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా పూలబావివీధిలోని ఉమాపుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో భారీ గణపతిని ఏర్పాటు చేశారు. వాటితో పాటుగా పాతబస్తీలోని జిల్లా హోల్‌సేల్ డ్రగ్ ట్రేడ్ సంఘం ఆధ్వర్యంలో తాటాకులవారివీధిలో భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా రాయల్ హోటల్ సెంటర్, కోమలవిలాస్, మల్లికార్జునపేట ఇలా పలు ప్రాంతాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో భారీ గణానాథుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మొత్తం మీద వన్‌టౌన్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ గణనాథులు కొలువుదీరి స్థానిక ప్రజానీకాన్ని కనువిందు చేశారు.

కిటకిటలాడుతున్న పందిళ్లు

వినాయకచవితి వేడుకల సందర్భంగా ఆయా పందిళ్లలో వేంచేసి ఉన్న వినాయకుని విగ్రహాలను చూసేందుకు ప్రజలు బారులు తీరారు. పాతబస్తీలోని సమ్మెటవారివీధి, పూజారివారివీధి, పూలబావి సందు, కందులవారివీధి, వస్త్రలత, మొయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో ఉన్న స్వామి విగ్రహాలను దర్శించుకునేందుకు వన్‌టౌన్‌వాసులు కుటుంబ సభ్యులను తీసుకుని తరలిరావడంతో ఆయా ప్రాంతాలన్నీ సోమ, మంగళవారాలు సాయంత్రం కళకళలాడుతూ కనిపించాయి.

ఎమ్మెల్యే పూజలు

స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వన్‌టౌన్‌లోని వివిధ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అలాగే కందులవారివీధిలోని గణపతికి పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో చెన్నుబోయిన పెద్దన్న, ఆయన కుమారుడు పెద్దిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, బాపతి కోటిరెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, యరడ్ల ఆంజనేయరెడ్డి, సంగీత, నృత్య అకాడమి డైరెక్టర్ బట్టిపాటి సంధ్యారాణి, శివ దంపతులు, 45వ డివిజన్ పార్టీ నాయకులు మైలవరపు కృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు బోర మల్లేశ్వరరెడ్డి, జంధ్యాల శ్రీను, పీతల నాగు, వాసు, హుస్సేన్, నాగుల్ మీరా పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని వివిధ గణపతి ఆలయాల్లో వినాయకచవితి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని కెనాల్‌రోడ్డులోని వినాయకస్వామి దేవస్థానంలో ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లోని వినాయకదేవస్థానంలో స్వామి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 28వ తేదీ వరకూ ఉత్సవాలు కొనసాగనున్నాయి.



ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని గణనాథుని పూజలో పాల్గొన్న వెలంపల్లి, కార్పొరేటర్లు



కెనాల్‌రోడ్డు ఆలయంలో వెలంపల్లి పూజలు



బాలగణపతి ఆలయంలో చంద్రయాన్‌లో విఘ్నేశ్వరస్వామి సెట్టింగ్



పాతశివాలయంలోని గణపతి ఆలయంలో పూజలు



వస్త్రలత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకుడు



సమ్మెటవారివీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడు



పూలబావివీధిలో కొలువుదీరిన గణపతి



రాయల్‌హోటల్ సెంటర్‌లో వినాయక విగ్రహం

నిమజ్జనానికి ప్రత్యేక భద్రత

డీసీపీ విశాల్‌గున్ని



సీతమ్మ పాదాల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పండగను పురస్కరించుకుని నగరంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలను పర్యవేక్షించనున్నట్లు నగర డెప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్‌గున్ని చెప్పారు. ఉత్సవ నిర్వాహకులు సోమవారం నుంచే వినాయక నిమజ్జనానికి తరలివచ్చారన్నారు. దీని దృష్ట్యా నగరంలో సోమవారం డీసీపీ విశాల్‌గున్ని నిమజ్జనానికి అనువైన ప్రదేశాలుగా కృష్ణలంక పీఎస్ పరిధిలోని సీతమ్మవారి పాదాలు సమీపంలోని ఘాట్, నున్న పీఎస్ పరిధిలోని పోలవరం కాలువలను ఎంపిక చేశామన్నారు. సీపీ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో పోలీస్ శాఖతోపాటు, మునిసిపాలిటీ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుని నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలను అందుబాటులో ఉంచి పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. లైటింగ్, బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో నార్త్ డివిజన్ ఏసీపీ సీహెచ్ రవికాంత్, సౌత్ ఏసీపీ రవికిరణ్, ఇన్‌స్పెక్టర్లు దుర్గారావు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం పటమటలోని జోనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, డెప్యూటీ మేనేజర్ రజనికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిత్ర హాస్పిటల్, న్యూ సిటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెడికల్ క్యాంప్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం కస్టమర్స్ సమావేశం నిర్వహించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించడంపై వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఖాతాదారులకు మరిన్ని సేవలు అందించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ భాస్కరరావు

పటమట(విజయవాడతూర్పు): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్ డివిజన్ ఏసీపీ పి. భాస్కరరావు సూచించారు. ఆటోనగర్ లోని ఏటిపి హాల్లో పటమట సీఐ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో 150 గణేష్ మండపాల నిర్వాహకులతో మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతి మండపం వద్ద పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేయాలని, పోలీస్ అధికారులు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది తరచూ తనిఖీ చేస్తార తెలిపారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే మండప నిర్వహకులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు పూర్తి బాధ్యతలను నిర్వాహకులు తీసుకోవాలని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సైలు పద్మ, సత్యనారాయణ, శాతకర్ణి, విక్రమ్ పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



మట్టి గణపతి ప్రతిమలను అందజేస్తున్న డీఎస్ఎంసీ పూర్వ విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పండుగ సందర్భంగా వెంకట మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గట్టు వెనుక పలు ప్రాంతాల్లో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. భవానీపురం ఐరన్ యార్డ్‌లో ముఠా కార్మికులు, గుమస్తాలకు, అలాగే కబేళా సెంటర్‌లో పెట్రోల్ బంక్ వద్ద, స్వాతీ రోడ్‌లోని చర్చి సెంటర్‌లో మట్టి గణపతి ప్రతిమలను ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దుర్గ కిషోర్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరుసగా మూడో సంవత్సరం మట్టి గణపతి బొమ్మలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

డీఎస్ఎంసీ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో..

విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్లోని దశవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ (డీఎస్ఎంసీ) హైస్కూల్ పూర్వ విద్యార్థులు గురుకృప వీధిలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఎస్ ఆదిత్య కిరణ్, బొగ్గవరపు చంద్రశేఖర్, అబ్బరాజు శ్రీను, బీ సుధాకర్, డీ రాజబాబు, లంకా శివానందం తదితరులు కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నినాదాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆంజనేయరాజు కళారంగ సేవలు ఆదర్శనీయం



ఆంజనేయరాజును సత్కరిస్తున్న సంగీత విద్వాంసుడు బ్రహ్మానందం, హేమలత

విజయవాడ కల్చరల్: సాహితీ సాంస్కృతిక రంగ ప్రముఖుడు బోడి ఆంజనేయరాజు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నవ కథావైతాళికుడు గురజాడ అప్పారావు వర్ధంతి, గణేష మహోత్సవాల ముగింపు సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయా గ్రంథాలయంలో సోమవారం సినీ సంగీత విభావరి, సాహితీవేత్త బోడి ఆంజనేయరాజుకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరావు మాట్లాడుతూ ఆంజనేయరాజు 30 సంవత్సరాలుగా నగరంలో సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహణలో కీలకమైన పాత్ర పోషించినట్లు తెలిపారు.

న్యాయవాది హేమలత ఆంజనేయరాజు సాహితీ సేవలను వివరించారు. ఆయన ఇటీవల అమెరికాలో జరిగిన ఆటా, నాట నిర్వహించిన తెలుగు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని పత్ర సమర్పణ చేసినట్లు పేర్కొన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆంజనేయరాజు దంపతులను సత్కరించారు. గాయనీ గాయకులు డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, జయప్రభ, పావని, వడ్డాది కామేశ్వరి, షబానా తదితరులు క్లాసికల్ గీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన జ్యోతిష్యశాస్త్ర వేత్త ప్రసూనా రామన్, గొళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, బీవీ వీరభద్రరావు, డాక్టర్ భాగ్యశ్రీ పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు స్థలం కేటాయించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని రాజీవ్ గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ఎటువంటి ఆక్రమణలు, జరగలేదని ఆ మార్కెట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ అజయ్‌కుమార్ రెడ్డి, బడ్డేటి ధర్మారావు పేర్కొన్నారు. మార్కెట్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తమ హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్‌కు ప్రభుత్వం కనీసం 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే అక్కడికి వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో ఏదో ఆక్రమణలు జరగాయని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వాటిని సంఘం పక్షాన ఖండిస్తున్నట్లు తెలిపారు. 60 సంవత్సరాలుగా రాజకీయాలకతీతంగా యూనియన్‌లో ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సంఘాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మార్కెట్‌ను ఇక్కడ నుంచి తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేని 20 ఎకరాల విశాలమైన స్థలంలో షాపులు కడితే అక్కడికి వెళ్లిపోతామని గతంలోనే ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్‌కు 100 ఎకరాలను కేటాయించిందన్నారు. సమావేశంలో మార్కెట్ వర్తకుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, బత్తుల దుర్గారావు, జాయింట్ సెక్రెటరీ రవికుమార్, కమిటీ సభ్యుడు వెన్నం రత్నారావు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): వినాయక చవితి పండగను పురస్కరించుకుని వినాయక విగ్రహ నిమజ్జనాల సమయంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కృష్ణానది ప్రాంతంలో ప్రకాశం బ్యారేజీ దిగువన, శనీశ్వర గుడి వెంబడి విగ్రహాల నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జనాలు బుధవారం నుంచి చేయవచ్చని, అందుకు అవసరమైన క్రేన్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఆయా పరిసరాలలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణను చేపట్టి నదిలో వ్యర్థాలు వేయకుండా చెత్త తరలించు వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. నగరంలో విగ్రహ నిమజ్జనాలు ఇక్కడ తప్ప, మరో చోట చేసినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహ నిమజ్జనం చేయు సమయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి అపశ్రుతులు జరగకుండా అధికారులకు సహకరించి వారి సూచనలు పాటించాలన్నారు. పూజకు ఉపయోగించిన సామగ్రి, పుష్పాలు నదిలో లేదా కాలువలో వేయకుండా విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బందికి అందించాలని తెలిపారు. పూజా సామగ్రిని గ్రీన్ వేస్ట్ రీసైక్లర్లు వారితో కలిసి చేపట్టిన ఫ్లవర్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ద్వారా పుష్పాలను అగరబత్తీలు, దూపాలను తయారు చేస్తారని పేర్కొన్నారు. ఆకులు, చెట్లను బయో మెథనైజేషన్ ప్లాంట్‌కు మిగిలిన వ్యర్థాలను విండో కంపోస్టింగ్ ద్వారా ఎరువుగా తయారుచేస్తామని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



ఆర్గనైజర్లకు సూచనలిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చవితి వేడుకలను చాలా ప్రశాంత, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని, వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యే వరకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులకు , ఆర్గనైజర్లకు మంగళవారం చిట్టినగర్ మహాలక్ష్మీ అమ్మవారి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా పందిళ్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత మైక్‌ను పెట్టడం, పాటలకు డ్యాన్సులు వేస్తూ స్థానికులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో సమన్వయం పాటించడంతో పాటు బాణసంచా కాల్చవద్దని పేర్కొన్నారు. డీజేలను ఏర్పాటు చేయవద్దని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు ఏ కొండూరు మండలం పాత కొండురు ఎస్సీ వాడకు చెందిన వెంపాటి సునందరావు, అరుణకుమారి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. సునందరావు పాస్టర్‌గా పని చేస్తుంటారు. ఈ నెల 6వ తేదీన సునందరావు, చిన్నకుమారుడు ప్రశాంత్‌తో కలిసి గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రార్థన నిమిత్తం బైక్‌పై వెళ్లాడు. ఆ సమయంలో బైక్‌కు కుక్క అడ్డు రావడంతో ఇద్దరు బైక్‌పై నుంచి కిందపడ్డారు. అంతట ఇద్దరిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుందనరావు సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

కరాటేలో సత్తా చాటిన నలంద విద్యార్థులు

జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్



లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో ఈ నెల 17న జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2023 పోటీల్లో నలంద విద్యార్థులు సత్తా చాటారు. అండర్–12 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. అండర్–11 విభాగంలో ఐదో తరగతి విద్యార్థిని ఆల్వినా గోల్డ్ మెడల్ సాధించగా, అండర్–12 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి కోట చరిష్ బ్రాంజ్ మెడల్‌ను గెలుపొందాడు. విజేతలను మంగళవారం స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదం ఎదురైతే ఎదిరించేలా ఉండాలన్నారు. ఆత్మరక్షణ విద్యలు నేర్పడం ద్వారా మాత్రమే ఆత్మవిశ్వాసం పెరిగి భయం పోతుందన్నారు. విజేతలు ఢిల్లీ, హర్యానాలో జరగనున్న ఇంటర్నేషనల్ పోటీల్లో కూడా సత్తా చాటి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు.